క్లుప్తంగా

జంగుబాయికి నివాళి



నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల హత్యకు గురైన కుడిమెత జంగుబాయికి మంగళవారం స్థానిక ఐబీ చౌరస్తాలో గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బిరుడ్ గోండ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి, గిరిజన సంఘాల నాయకులు కన్నీబాయి, మడావి దత్తు, కపిల్, తిరుపతి, అర్జున్, కనీనబాయి పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన జెడ్పీటీసీ



మంత్రికి విన్నవిస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి దంపతులు

బోథ్: బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి హైదరాబాద్‌లోని మంత్రి కేటీఆర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని విన్నవించారు. శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్లు, యూత్ నాలెడ్జ్ సెంటర్, మినీ స్టేడియం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గ కేంద్రాన్ని బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, సిరికొండ, ఇచ్చోడ మండలాలతో కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని విన్నవించారు. శిథిలావస్థలో ఉన్న తహసీల్ కార్యాలయంపై సాక్షి గతంలో ప్రచురితమైన కథనాలను మంత్రికి చూపించారు. వెంటనే జిల్లా కలెక్టర్‌తో మంత్రి మాట్లాడినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. బోథ్ సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన మోహన్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లో ఉంటున్న ఇచ్చోడకు చెందిన ఎరాజీవార్ మోహన్ వడ్రంగి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై ఉట్నూర్ వస్తుండగా పులిమడుగు వద్ద పందిని ఢీకొని కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూం టు రీడ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉదయశ్రీ

ఇచ్చోడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూం టు రీడ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల కోఆర్డినేటర్ ఉదయశ్రీ కోరారు. మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూం టు రీడ్‌ను ఉపాధ్యాయులు పకడ్బందీగా అమలు చేస్తున్నారని అన్నారు. హెచ్‌ఎం హెమన్‌రావు ఉపాధ్యాయులు రమణరెడ్డి, రాజేందర్, ఈశ్వర్, సంగీత ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఉట్నూర్ డిపో ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు దశ్వంత్, రమాకాంత్, రాజశేఖర్, ప్రవీణ్, గౌతం, ఫైజలఖాన్ తదితరులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పండ్లు అందజేశారు. డాక్టర్ మహేందర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు లేక అవస్థలు

- బేల మార్కెట్ కూడలిలో టాయిలెట్లు కరువు
- ఒంటికి, రెంటికీ ఇబ్బందులు
- అంతర్రాష్ట్ర ప్రయాణికుల అవస్థలు



బేల మండలకేంద్రం

బేల: ప్రతినిత్యం అంతరాష్ట్ర ప్రయాణికులు, మండలవాసులతో కిటకిటలాడుతున్న మండలకేంద్రమైన బేలలోని మార్కెట్ కూడలిలో (353బి జాతీయ రహదారి మార్గంలో) పబ్లిక్ టాయిలెట్లు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఒంటికి, రెంటికి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. టాయిలెట్స్ నిర్మించాలని స్థానిక పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో పలుమార్లు విన్నవించారు. కాని పాలకుల్లో ఏమాత్రం చలనం లేదు. ఈ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు.

నిరుపయోగంగా..

ప్రతినిత్యం రద్దీగా ఉండే మార్కెట్ కూడలిలోని శివాజీ చౌరస్తా, వారసంత, అంబేద్కర్ చౌరస్తాలో ఒంటికి, రెంటికి ఎలాంటి పబ్లిక్ టాయిలెట్లు లేవు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న టాయిలెట్ల నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే మారాయి. స్థానిక వ్యాపార సముదాయ ప్రాంతాల్లో వ్యాపారులు, కూలీలు, రైతులు తదితరులు ప్రతీరోజు తమ పనుల నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు. గ్రామాల నుంచి వచ్చే వీరంతా వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, పల్లె ప్రగతి కార్యక్రమాలు చేపట్టినా ఇక్కడ వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం కోసం లక్షల నిధులు మంజూరు చేస్తున్నా ప్రజాప్రతినిధులతోపాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఏళ్ల నుంచి పబ్లిక్ టాయిలెట్లు లేక పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయటే కానిస్తున్నారు. దీంతో బస్టాండ్, ఈ ప్రధాన కూడళ్లలో నుంచి పలుచోట్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

ఒంటికి, రెంటికీ అవస్థలు

మహారాష్ట్ర నుంచి పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, వందకు పైబడి లారీల రాకపోకలు ప్రతిరోజు మండలకేంద్రంలోని జాతీయ రహదారి మార్గంలో వస్తుంటాయి. వందలాది మంది ప్రయాణికుల రాకపోకలు ఇక్కడికి ప్రతినిత్యం కొనసాగుతున్నాయి. ఇక వీరంతా ఒంటికి, రెంటికీ వెళ్లాలంటే ఆరుబయటే. తీవ్ర అవస్థలు పడక తప్పడం లేదు.

పట్టించుకోవడం లేదు



బేల మార్కెట్ కూడలిలోని శివాజీ, అంబేద్కర్ చౌరస్తాలలో టాయిలెట్స్ లేవు. ప్రజలు ఒంటికి, రెంటికీ ఇబ్బంది పడుతున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదు. అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మహిళల బాధలు వర్ణనాతీతం. గ్రామ పంచాయతీ పాలకవర్గం స్పందించి వసతులు కల్పించాలి.

– వెంకటేశ్, బేల

త్వరలో పనులు చేపడుతాం



బేలలోని మార్కెట్ కూడలిలో పబ్లిక్ టాయిలెట్స్ అవశ్యకతపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ సహకారంతో ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్లాం. ఆయన చొరవతో టాయిలెట్స్ నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజల సౌకర్యార్థం టాయిలెట్స్ అందుబాటులోకి తెస్తాం.

– ఇంద్రశేఖర్, సర్పంచ్ బేల

బురద రోడ్లు



వర్షానికి తెగిన పున్నగూడ రోడ్డు



నార్నూర్: వర్షాకాలం వచ్చిందంటే చాలు గిరిగ్రామాల రోడ్లు బురదమయం అవుతోంది. రాకపోకలు సాగించాలంటే గిరిజనులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గిరి గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదగా మారింది. గాదిగూడ మండలం పున్నగూడ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీ శాఖ అనుమతి పేరుతో పనులు ప్రారంభించలేదు. గత కొన్నేళ్లుగా రోడ్డు సమస్యతో గిరిజనులు ఇక్కట్లు పడుతున్నారు. వానలు కురిస్తే బయటకు వెళ్లని పరిస్థితి ఉండడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతుతన్నారు.

ముసురు వాన



ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో రెండురోజులుగా ముసురు వాన కురుస్తుంది. మంగళవారం ముసురు వానతో ప్రజలు, పాఠశాలల విద్యార్థులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. ఆయా గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

బోథ్: మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజధాని భోపాల్‌లో మంగళవారం నిర్వహించిన 'మేరా బూత్ సబ్ సే మజ్ బూత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. కార్యకర్తలనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. బూత్ స్థాయి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నాయకులు మండలకేంద్రంలో ఎల్ఈడీ స్క్రీన్‌లో వీక్షించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేష్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, రాజన్న, బీజేవైఎం అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న నాయకులు

బోథ్: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు జెట్టి రాజేశ్వర్, భోజరాజు, జంగాల భోజన్న, బొజ్జ సాయన్న, నర్సయ్య, భీముడు, మహిపాల్, పోతలింగు, మధు, బుచ్చన్న, భోజపతి, శ్రీనివాస్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖరా(కె) గ్రామం సందర్శన



సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలిస్తున్న సోనాల పంచాయతీ పాలకవర్గ సభ్యులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) పంచాయతీని బోథ్ మండలం సోనాల గ్రామ సర్పంచ్ సదానందం, పాలకవర్గ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఇంకుడు గుంతలు, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, సేంద్రియ ఎరువుల తయారీ, సోలార్ విద్యుత్, ఇంటింటికీ చెట్ల పెంపకం, తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ వారికి వివరించారు. ముఖరా(కె)ను అన్నిరంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంతో రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు వచ్చాయని సోనాల సర్పంచ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

- ఇంటర్ అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం
- గ్రామాల్లో పర్యటన..
- ప్రైవేట్‌కు దీటుగా కళాశాలల్లో నాణ్యమైన విద్య
- విద్యార్థులకు వివరిస్తూ చేరాలని విజ్ఞప్తి



విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకులు

నార్నూర్: ఇంటర్ అడ్మిషన్లకు బోర్డు అనుమతిచ్చింది. ఈ ఏడాది పాత పద్ధతిలో కాకుండా ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీలకు మాత్రమే అడ్మిషన్ లాగిన్ ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. షెడ్యూల్ ప్రకారం తొలివిడత అడ్మిషన్లు జూలై 31 వరకు కేటాయించారు. కాగా జూన్ 1 నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభించారు.

గ్రామాల్లో ప్రచారం

ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ఫలితాలు మెరుగ్గానే ఉన్నందున ఈ ఏడాది అడ్మిషన్లు పెంచాలని ఇంటర్ బోర్డు సూచించింది. విద్యార్థులను కలిసి వారితో అడ్మిషన్లు తీసుకునేలా చూడాలని ఆదేశాలతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పల్లెబాట పట్టారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులను కలసి, కళాశాలల్లో ఉపకార వేతనాలు, మౌలిక వసతులు, కంప్యూటర్, విశాలమైన తరగతి గదులు, తదితర సౌకర్యాలు అందుతున్నాయని వివరిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు వెళ్లి పదో తరగతి పూర్తిచేసినవారి వివరాలు సేకరించి వారిని కళాశాలల్లో చేర్పించేలా కృషి చేస్తున్నారు. ప్రతిరోజు కళాశాలల్లో చేర్పించిన విద్యార్థుల వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తున్నారు.

కళాశాలలో అన్ని సౌకర్యాలు

జూనియర్ కళాశాలలో బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయి. ఉచిత ఇంటర్ విద్య, పాఠ్యపుస్తకాలు, కార్పొరేట్ దీటుగా విద్యాబోధన అందుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలతో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– మహేందర్, కళాశాల ప్రిన్సిపాల్, నార్నూర్

ధర్నా విజయవంతం చేయండి

బోథ్: ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పింఛన్‌దారుల సంఘం కన్వీనర్ ప్రేమ్‌సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ రెండవ పీఆర్సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. పెన్షనర్ల కమ్యూనికేషన్ రికవరీని 12 ఏళ్లకు కుదించాలన్నారు. ఈధర్నాకు పెన్షనర్లు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

నార్నూర్: గాదిగూడ మండలంలో 2019–22 సంవత్సరానికిగాను చేపట్టిన ఉపాధి హామీ పనులపై గతవారం రోజులుగా సోషల్ ఆడిట్ బృందం గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించిందని ఎంపీడీవో రామేశ్వర్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు తాంసి సహకార సంఘం సమావేశం

తాంసి: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో కేశవ్ తెలిపారు. సొసైటీ చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తాంసి, భీంపూర్ మండలాల్లోని సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

అక్రమ వెంచర్ తొలగిస్తాం

బోథ్: మండల కేంద్రంలోని 198/ఆ లో వెలసిన వెంచర్లను డీఎల్‌పీవో ధర్మారాణి మంగళవారం పరిశీలించారు. డీసీసీసీ కార్యాలయంలో కొందరు ఫిర్యాదు చేయడంతో ఆ వెంచర్‌ను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. అక్రమ వెంచర్ తొలగిస్తామన్నారు. సర్పంచ్ సురేందర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, కార్యదర్శి అంజయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

ఇచ్చోడ: ప్రతి విద్యార్థికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని ఎంఈవో ఉదయ్‌రావు, గుడిహత్నూర్ ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ శైలేందర్‌రెడ్డి అన్నారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా మండల కేంద్రంలో జెడ్పీ పాఠశాల, ఉర్దూ మీడియం, కస్తురిబాలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



బోథ్: గెలుపొందిన విద్యార్థులు



జైనథ్: ప్రశంసపత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

నేరడిగొండ: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యాన ఇచ్చోడలో మంగళవారం ఆలిండియా లెవల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వడూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు నిఖిత, హర్షితలు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. హెచ్‌ఎం భారతి, పీఈటీ అఖిల్, ఎస్‌ఎంసీ చైర్మన్ కొప్పుల గంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్: స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో 11 ఉన్నత పాఠశాల నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆదర్శ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, కనుగుట్ట లోని జెడ్పీ ఉన్నత పాఠశాల(ద్వితీయ), పొచ్చెరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(తృతీయ) స్థానంలో నిలిచింది. విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలను ఆర్బీఐ వారు అందించనున్నట్లు నోడల్ అధికారిగా వ్యవహరించిన గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రహ్లాద్ తెలిపారు.

తలమడుగు: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో జెడ్పీఎస్ఎస్ కజ్జర్ల పాఠశాల విద్యార్థులు సంధ్యారాణి, రాజశ్రీ, ప్రథమ స్థానంలో ప్రతిభ కనబర్చారు. ద్వితీయ స్థానంలో జెడ్పీఎస్ఎస్ కుచులాపూర్ నుంచి కిష్ణ, ప్రణయ్, తృతీయ స్థానంలో జెడ్పీఎస్ఎస్ దేవాపూర్ పాఠశాల నుంచి వైష్ణవి, విజ్ఞ ఉన్నారు. వీరికి నగదుతోపాటు బహుమతులను ఎంఈవో నారాయణ, అందజేశారు.

జైనథ్: చదువుతో పాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని నోడల్ ఆఫీసర్ జితేందర్ అన్నారు. టీజీబీ ఆధ్వర్యంలో జైనథ్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసి అనే అంశంపై మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు (ప్రథమ), ఆదర్శ పాఠశాల విద్యార్థులు (ద్వితీయ), ఉన్నత పాఠశాల గూడ విద్యార్థులు(తృతీయ) స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జూలై 4న ఆదిలాబాద్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా ఈ పోటీలకు ఎ.రమేశ్ ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గొడం నగేశ్

నేరడిగొండ: మండలలోని కుమారి గ్రామ మాజీ సర్పంచ్ నంది అడెల్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ గొడం నగేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ రాజు, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, నాయకులు గాదె శంకర్, మురళీగౌడ్, పీపీ రమణ, గ్రామస్తులు ఉన్నారు.

బోథ్: సోనాల గ్రామానికి చెందిన కవిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బ్లాక్ అధ్యక్షుడు ప్రఫుల్‌రెడ్డి, మండల అధ్యక్షులు కుర్మే మహేందర్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి అరుణ, మండల మహిళా అధ్యక్షురాలు అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీల నియామకం

కైలాస్‌నగర్: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్లమెంట్ అధ్యక్షుడిగా ఆనంద్, పార్లమెంట్ కమిటీ కార్యవర్గాన్ని 22 మందితో కలిసి పూర్తిస్థాయిలో ఎన్నుకున్నారు. సిర్పూర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా గుళ్లపల్లి ఆనంద్, ఆసిఫాబాద్ అధ్యక్షుడిగా పెరుగు ఆత్మరాం, ఖానాపూర్-పవర్ దేవిదాస్, ఆదిలాబాద్-అల్లూరి రాజారెడ్డి, బోథ్-ఆత్రం జ్ఞానసుధ, ముధోల్‌కు విఠల్ నియమించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వరంతో బాధపడుతున్న 27 మందికి వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఆయన వెంట హెల్త్‌అసిస్టెంట్లు కైలాస్, సుభాష్, ఏఎస్‌ఎం కాంత, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

పర్యాటకులకు దారి తెలిసేదెలా ?



పొచ్చెర, కుంటాల జలపాతాలకు వెళ్లేందుకు పర్యాటకులకు అనేక అవస్థలు ఎదురవుతున్నాయి. మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి పొచ్చెర జలపాతానికి వెళ్లే దారిలో బోర్డు సరిగ్గా కనిపించకపోవడంతో పర్యాటకులు దారి తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. కుంటాల జలపాతం వెళ్లే దారిలో సైతం బోర్డులు కనిపించేలా చర్యలు చేపడితే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. - నేరడిగొండ

పారిశుధ్యం లోపించకుండా చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఇంద్రవెల్లి: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎంపీవో సంతోష్, సర్పంచ్ బాగుబాయి, సిబ్బంది ఉన్నారు.